

పలమనేరు, గంగవరం మండలాల్లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రియల్టర్లలో ఎక్కువమంది రాజకీయ పరపతి కలిగినవారు, ప్రభుత్వ ఉద్యోగులే కావడంతో డీకేటీ భూములు సైతం సంపన్నుల ఖాతాలోకి చేరిపోతున్నాయి. చల్లటి వాతావరణానికి తోడు సమీపంలోనే చెన్నై-బెంగళూరు జాతీయరహదారి ఉండడంతో ఇక్కడ నివేశస్థలాలకు గిరాకీ ఉంది. నివేశస్థలాల విక్రయాలపై ఆధారపడినవారు 500మంది వరకు ఉన్నారంటే రియల్ఎస్టేట్ వ్యాపారం ఇక్కడ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిబంధనల లే'అవుట్'

- వెంచర్ల కోసం కాలువలనూ కుదించేస్తున్నారు
- పలమనేరులో రియల్టర్ల ఇష్టారాజ్యం



పలమనేరుకు ఆనుకుని వున్న రాచకాలువ స్థానే కుదించి నిర్మించిన మురుగునీటి కాలువ

ఎద్దుల చెరువు కలుజు నీరు వెళ్లే రాచకాలువ పూడ్చివేత

పలమనేరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఎక్కువ మంది లేఅవుట్లు వేసి విక్రయించేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, డీకేటీ భూములున్న చోట పట్టా భూములను కొని డీకేటీ భూములను కలిపేసుకుంటున్నారు. చెరువుకట్టపైనుంచి ఆయకట్టులోకి మట్టిని నింపి లే అవుట్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయరహదారి వంతెన నుంచి వర్షపు నీరు వెళ్లే ప్రాంతంలో పైపులు పూడ్చివేసి ఓ రియల్టర్ లేఅవుట్ వేశారు. ఓ నాయకుడు ఒత్తిడి తేవడంతో అధికారులు పైపులను తొలగించినా మళ్లీ వారే ఆ పైపులను పూడ్చివేయడం విశేషం. తాజాగా మఠం భూములకు సమీపంలో పెద్దచెరువుకు ఎద్దుల చెరువు కలుజు నీరు వచ్చే రాజ కాలువను లేఅవుట్ కోసం కుదించేశారు. 10 అడుగుల కంటే వెడల్పుండే రాజకాలువ స్థానే మూడడుగుల లోపు వెడల్పున్న మురుగునీటి కాలువను నిర్మించారు. ఈ స్థలానికి ఆనుకుని 761 సర్వే నెంబరుకు సంబంధించి ప్రభుత్వ భూమి అని తహసిల్దార్



లే అవుట్ వద్ద అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

బోర్డు ఏర్పాటు చేసినా రియల్టర్ మట్టితో లేఅవుట్ ప్రాంతాన్ని ఆయకట్టుకంటే రెండడుగుల ఎత్తు పెంచేశారు. గంగవరం తహసిల్దార్ బోర్డు పెట్టారేగాని రాజకాలువ కుదింపును పట్టించుకోలేదు. పెద్దచెరువు ఆయకట్టు, బొమ్మిదొడ్డి సమీపంలోని కన్నికలచెరువు ఆయకట్టులో కూడా లే అవుట్లు వెలిశాయి.

40లో 36 అక్రమ లేఅవుట్లే..

పలమనేరు మున్సిపాలిటీలో దశాబ్దకాలంగా దాదాపు 40 లేఅవుట్లు వేయగా అందులో 36 అక్రమమైనవిగా గుర్తించామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. వీటిని బ్లాక్ లిస్టులో పెట్టామన్నారు. జె.ఎస్.నగర్, పద్మశ్రీ లే అవుట్, రమాగార్డెన్స్ లే అవుట్లకు మాత్రమే అప్రూవల్ ఉందన్నారు. దాదాపు 50 ఎకరాల్లో 36 మంది అక్రమంగా లే అవుట్లు వేసి విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. అక్రమ లేఅవుట్లలో గృహనిర్మాణాలకు ప్లాన్లు అప్రూవల్ కావని ఆయన స్పష్టం చేశారు. అక్రమ లేఅవుట్లు వేసిన వారికి నోటీసులు ఇచ్చామన్నారు. అక్రమ లేవుట్లలో బోర్డులు కూడా ఏర్పాటు చేశామన్నారు.

స్థలాలు కొన్న వారిపై వడ్డన

అక్రమ లేఅవుట్లలో నివేశస్థలాలు కొన్నవారి నుంచి మున్సిపల్ అధికారులు లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. నిబంధనల మేరకే వసూలు చేస్తున్నట్లు సమర్థించుకుంటున్నారు. రియల్టర్ లాభపడుతున్నాడే తప్ప స్థలాలు కొన్నవారు మాత్రం లబోదిబోమంటున్నారు. ప్రభుత్వానికి చెల్లించవలసిన కన్వర్షన్ ఫీజులకు, నిబంధనలకు, పబ్లిక్ కోసం విడిచిపెట్టవలసిన స్థలాలకు కక్కుర్తిపడి రియల్టర్లు అక్రమంగా లే అవుట్లు వేసి విక్రయాలు సాగిస్తున్నారు.



బొమ్మిదొడ్డి ఆయకట్టులో తాజాగా వేసిన లేఅవుట్

కలిసొస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ లొసుగులు

ఏ స్థలమైనా సులభంగా రిజిస్టరవుతుండడం రియల్టర్ల అక్రమ వ్యాపారానికి కారణమవుతోంది.రిజిస్ట్రేషన్ శాఖలోని లొసుగులు వీరికి ఉపకరిస్తున్నాయి. వెనకాముందూ చూడకుండా జరుగుతున్న ఈ ప్రక్రియకు రెవెన్యూ అధికారులు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే భవిష్యత్తులో సామాన్యులకు నివేశస్థలాలుండవు. రాజకాలువల ఆక్రమణల తొలగింపు కూడా వివాదమవుతుంది. ఇప్పటికే శ్మశాన స్థలాలు ఆక్రమించుకున్నవారికి అధికారులు పటాలిచ్చిన వివాదాలు హైకోర్టులో నడుస్తున్నాయి. హైకోర్టుకు నివేదికలు ఇవ్వలేక రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

గంటలోనే దర్శనం



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో ఇంటర్వ్యూ...

- తిరుమల ప్రక్షాళన మొదలైంది.
- ఆ చెత్త కాంట్రాక్టు రద్దు చేస్తాం
- భక్తులతో బూతులు మాట్లాడితే ఊరుకోం
- అన్యమత ఉద్యోగులను జమ్మూకి పంపుతాం

'గంటలకు గంటలు క్యూలైన్లలో నిలబడి ఉండాల్సిన అవసరం లేదు. ముఖ ఆధారిత గుర్తింపు వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తే కేవలం గంటలోనే భక్తులకు శ్రీవారి దర్శనం సాధ్యమవుతుంది. ఈ సాంకేతికతను ఉచితంగా అందివ్వడానికి సంస్థలు ముందుకు వస్తున్నాయి. రెండు మూడు నెలల్లోనే ఇది అమలవుతుంది'

నెలన్నరపాటు నిశిత పరిశీలన తర్వాత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ధీమాగా చెప్పిన మాట ఇది. జగన్ జమానాలో అవినీతి చర్యలు, అర్థంపర్థం లేని వ్యయాలు, దర్శనాల దందాలు, అనాలోచిత నిర్ణయాలు.. తిరుమల కొండను కొల్లగొట్టే దిశగా సాగాయనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో పెనుమూరు బిడ్డ బీఆర్ నాయుడు టీటీడీ బాధ్యతలు స్వీకరించారు. చంద్రబాబు ఆకాంక్షకు అనుగుణంగా తిరుమల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. కొత్త చైర్మన్‌గా ఆయన పరిశీలనలు.. చేయాలనుకుంటున్న మార్పుల గురించి ఆంధ్రజ్యోతితో సంభాషణలో వెల్లడించారు.

- ఆ విశేషాలు.. 6లో -

స్కూటర్ ఢీకొని ఉపాధ్యాయుడి మృతి



సిద్ధయ్య శెట్టి

పూతలపట్టు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూటర్ ఢీకొని ఉపాధ్యాయుడొకరు మృతి చెందారు. ఐరాల మండలం పత్తిపాటివారిపల్లెకు చెందిన సిద్ధయ్య శెట్టి (61) పూతలపట్టు మండలం తలపులపల్లె హైస్కూల్లో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్నారు.సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల విధుల్లో భాగంగా గురువారం స్థానిక పోలీసుస్టేషన్ వద్దకెళ్లి ప్రశ్నపత్రాలను తీసుకుని ద్విచక్ర వాహనంలో రంగంపేట వద్ద ఉన్నత పాఠశాలలో ఇచ్చారు. తిరిగి తలుపులపల్లె వెళ్లడానికి రోడ్డు క్రాస్ చేస్తుండగాపీలేరు వైపు వెళ్తున్న స్కూటర్ అతివేగంగా వచ్చి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సిద్ధయ్యను చీలాపల్లె సీఎంసీకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయన ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్నారు.పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మీ సమస్యలు వినడానికే వచ్చా

- నలగాంపల్లె మహిళలతో ముఖాముఖిలో భువనేశ్వరి



నేటి పర్యటన ఇలా..

9ఏఎం - 10ఏఎం : ప్రజలనుంచి వినతుల స్వీకరణ

10.30 ఏఎం- 12 పీఎం : కుప్పం మండలం వానగుట్టపల్లెలో మహిళలతో ముఖాముఖి

12.15 పీఎం -1.45 పీఎం : అడవిబూదుగూరు గ్రామ మహిళలతో ముఖాముఖి

2.30 పీఎం - 4 పీఎం : గుండ్లమడుగు గ్రామ మహిళలతో ముఖాముఖి

4.45 పీఎం - 5.45 పీఎం : మహాప్రత్యంగిరా దేవికి పూలు, వెండి కిరీటం సమర్పణ

6పీఎం - 7 పీఎం : డీకేపల్లెలో మహిళలతో ముఖాముఖి, **7.15 పీఎం :** పీఈఎస్ గెస్ట్ హౌస్‌కు చేరిక, బస.

కుప్పం/గుడుపల్లె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'రాజకీయాలు చేయడానికో లేదా పోసుకోలు ప్రసంగాలు ఇవ్వడానికో ఇక్కడకు రాలేదు. మీలో కలసిపోయి మీ సాదకబాధకాలు వినడానికి వచ్చా' అని ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు.గుడుపల్లె మండలం నలగాంపల్లెలో గురువారం ఆమె మహిళలతో మమేకమై వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబును ఎంతో నమ్మకంతో గెలిపించినందుకు ధన్యవాదాలు చెప్పారు. అదే నమ్మకాన్ని తమ కుటుంబం కుప్పం మీద, కుప్పం మహిళల మీద చూపిస్తుందన్నారు.మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక పథకాలు అమలు చేస్తున్నారని, ఇంకా కొన్ని పథకాల గురించి ఆలోచిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు తరఫున కూడా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అవసరమైన సర్వే జరిపి, నివేదికలు పంపామన్నారు.తాను ఎన్నికల ముందు చెప్పినట్లుగా మూడు నెలలకోసారి నియోజకవర్గానికి వస్తున్నానని, భవిష్యత్తులో కూడా వస్తానని అన్నారు. ప్రతి గ్రామానికీ వచ్చి సమస్యలు వింటానని, ఆ విన్న సమస్యలను చంద్రబాబుకు నివేదించి తీర్చడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.రోడ్లు, మురుగు కాలువలు, విద్యుద్దీపాలు, బ్యాంకు రుణాలు, చంద్రన్న బీమా పునఃప్రారంభం, శిథిలమైన అంగన్వాడీ భవనాల నిర్మాణం, ఇంటి స్థలాలకోసం పట్టాలు, మహిళా సంఘాలకు కమ్యూనిటీ హాళ్లు వంటి సమస్యలను మహిళలు ప్రస్తావించారు. వీటన్నింటిపై స్పందించిన భువనేశ్వరి మాట్లాడుతూ ఇప్పుడు మహిళలు ప్రస్తావిస్తున్న సమస్యలను బట్టి, గత ప్రభుత్వం గ్రామాలకు ఏమీ చేయలేదని, అసలు పట్టించుకోలేదని తేటతెల్లమవుతున్నదన్నారు.మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పలు అభివృద్ధి పనులకు కోట్ల రూపాయల నిధులు ఇప్పటికే మంజూరు చేశారని, ప్రస్తుతం కొన్ని పనులు కూడా జరుగుతున్నాయని గుర్తుచేశారు. కుప్పం టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ పెట్టారని,జననాయకుడు అనే పోర్టల్‌లో మీ అర్జీలు అప్‌లోడ్ అవుతాయని,కాబట్టి దాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు, డ్రగ్స్‌కు బానిస కావొద్దు

- విద్యార్థులకు భువనేశ్వరి ఉద్బోధ

కుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వ్యసనానికి యువత దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు.కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా గురువారం ఆమె కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. సోషల్ మీడియా వ్యసనం కుటుంబాలకు దూరం చేస్తుందని గ్రహించాలన్నారు.గంజాయి వంటి డ్రగ్స్‌కు బానిసలు కావొద్దని హితవు పలికారు. యువతను అటువైపు ఆకర్షించడానికి చాలామంది చూస్తారని, అది వారి స్వలాభమన్నారు. దీనివల్ల సమాజంలో అసాంఘిక శక్తులు చెలరేగి, జీవితాలు ధ్వంసమవుతాయని హెచ్చరించారు. యువత ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరిలో నాయకత్వ లక్షణాలు ఉంటాయని, కాకపోతే దానికి కృషి, పట్టుదల తోడైతే మీరే భవిష్యత్తు నాయకులని యువతకు భువనేశ్వరి పిలుపునిచ్చారు.తానిక్కడకు ముఖ్యమంత్రి భార్యగానో లేదా ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీగానో రాలేదన్నారు. ఒక యువతరం మేలుకోరే తల్లిగా కొన్ని మంచి మాటలు చెప్పిపోవడానికి వచ్చానన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకోర్చి చదువులు చెప్పిస్తున్నారని, వారిని, గురువులను ఎప్పటికీ గౌరవించాలని హితవు పలికారు.ఉన్నత స్థానాలకు ఎదిగిన ఎవరో ఒకరిని ఆదర్శంగా తీసుకుని, ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. రాజకీయపరంగా తానిక్కడకు రాలేదని 'మిమ్మల్ని మోటివేట్ చేయడానికి వచ్చాను. లోకేశ్‌కు ఏది చెప్పానో అదే మీకు చెబుతున్నాను' అని భువనేశ్వరి ప్రసంగాన్ని ముగించారు.



విద్యార్థులతో భువనేశ్వరి సెల్ఫీ

కేవీకేకి 50ఎకరాలు

- పుంగనూరు కెనాల్‌కు రూ.480 కోట్లతో లైనింగ్ పనులు
- 31 జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం
- రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లకు మరో రెండేళ్లు
- మంత్రివర్గ నిర్ణయాలు

చిత్తూరు, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు 50.21 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది.గురువారం అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో దీంతో పాటు జిల్లాకు మరింత లబ్ధి కలిగే నిర్ణయాలున్నాయి.కృషి విజ్ఞాన కేంద్రం కోసం కేటాయించిన స్థలాన్ని ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీకి బదిలీ చేశారు. ఈమేరకు సెప్టెంబరు 22వ తేదీన తమ్మిగానిపల్లె నుంచి కేంద్రం వరకు సుమారు కిలోమీటరు మేర మట్టి రోడ్డును కూడా ఏర్పాటు చేశారు. ● హంద్రీనీవా పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు కాంక్రీట్ లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.480 కోట్ల నిధుల్ని ఖర్చు చేయాలని నిర్ణయించారు. పనులు పూర్తయితే కెనాల్ ప్రవాహ సామర్థ్యం 145 క్యూసెక్కుల నుంచి 282 క్యూసెక్కులకు పెరుగుతుంది. ఈ పనుల్ని జూన్, జూలైలోగా పూర్తి చేయడానికి నిర్ణయం తీసుకున్నారు.● 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనాన్ని అమలు చేసింది. దాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం మళ్లీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నెల నుంచే దీన్ని ప్రారంభించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.జిల్లాలోని 31 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యాభ్యాసం చేస్తున్న 10,837 మంది విద్యార్థులకు ఇది ఉపయోగపడనుంది.● వైసీపీ ప్రభుత్వం భూరీసర్వే చేపట్టిన విషయం తెలిసిందే. దీని కోసం 2022 సెప్టెంబరు 23వ తేదీన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లను రెండేళ్ల కాలానికి నియమించిన విషయం తెలిసిందే. ఇలా ఉమ్మడి జిల్లాలో 67 మంది డీటీలు నియమితులయ్యారు. వీరి పదవీకాలం ఈ ఏడాది సెప్టెంబరుతో ముగియగా.. కూటమి ప్రభుత్వం వారిని మరో రెండేళ్ల పాటు పొడిగించింది. అంటే 22.09.2026 వరకు డిప్యూటీ తహసీల్దార్లు పనిచేయనున్నారు.

వాయిదాపడ్డ సమ్మేటివ్ పరీక్షలు నేటి నుంచి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో వివిధ కారణాలతో వాయిదా పడ్డ సమ్మేటివ్ అసెస్మెంట్1 పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు డీఈవో వరలక్ష్మి, డీసీఈబీ సెక్రటరీ పరశురాం గురువారం తెలిపారు. పేపర్ లీక్ కారణంగా ఆరు నుంచి టెన్త్ వరకు వాయిదాపడ్డ గణిత పరీక్ష శుక్రవారం నిర్వహిస్తారన్నారు. వర్షాల కారణంగా వాయిదా పడ్డ పరీక్షలు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఇంగ్లీష్, ఆరు నుంచి టెన్త్ వరకు హిందీ పరీక్ష ఈనెల 21వ తేదీన జరుగుతుందన్నారు. 13న వాయిదాపడ్డ పరీక్షలు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మ్యాథ్స్, ఆరు నుంచి టెన్త్ వరకు ఇంగ్లీష్ 23న జరుగుతుందన్నారు.

ప్రజలపై భారం లేకుండా భూముల మార్కెట్ విలువ సవరణ: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారం లేకుండా భూముల మార్కెట్ విలువల సవరణ చేయాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. వచ్చేనెల ఒకటి నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమల్లోకి రానున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పురపాలిక, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో సమీక్షించారు. శాస్త్రీయ విధానంలో భూముల మార్కెట్ విలువ నిర్ధారించి ప్రతిపాదనలు ఖరారు చేయాలన్నారు.వాణిజ్య ప్రాంతాలు మినహా 10 నుంచి 15శాతం లోపు మాత్రమే భూముల విలువ పెంచాలన్నారు. వాణిజ్య ప్రాంతాల్లో అక్కడి పరిస్థితికి అనుగుణంగా పెంపును ప్రతిపాదించామన్నారు. గత ఏడాది భూముల విలువ పెరిగిన చోట మళ్లీ పెంపు ప్రతిపాదన భారీగా చేయవద్దని సూచించారు. జిల్లా రిజిస్ట్రార్ మునిశంకరయ్య మాట్లాడుతూ.. ఎక్కడెక్కడ ఎంతమేర విలువలు పెంచితే ప్రజలపై భారం పడదన్న అంశంపై రెండునెలల పాటు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కసరత్తు చేశారన్నారు. ఈసారి గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ధరలు పెంచేలా ప్రతిపాదించామన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మేనేజర్ వర్మ, ఎనిమిది మంది సబ్‌రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

నేడు నోటీసు బోర్డుల్లో, రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌లో..

కొత్తగా ప్రతిపాదించిన ధరల వివరాలను శుక్రవారం అన్ని సబ్‌రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీతోపాటు పలు ముఖ్య ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రదర్శిస్తారు. రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌లో కూడా వీటిని ప్రదర్శించనున్నారు. ఈనెల 24వ తేదీవరకు ప్రజలనుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. 27వ తేదీవరకు పరిశీలన చేసి, ప్రభుత్వం పరిశీలనకు పంపిస్తారు.

చల్లా బాబుకు పలువురి శుభాకాంక్షలు

పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రొంపిచెర్లకు వచ్చిన చల్లా రామచంద్రారెడ్డికి టీడీపీ శ్రేణులు హారతులు పట్టి, మంగళవాయిద్యాలతో వైభవంగా స్వాగతించాయి.





సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నీకి ఎస్వీయూ ఫుట్‌బాల్ జట్టు



తిరుపతి(క్రీడలు), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి ఎస్వీయూ ఫుట్‌బాల్ పురుషుల జట్టు ఎంపికైనట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్ రెడ్డి తెలిపారు. శనివారం కేరళలోని కాలికట్‌లో జరిగే పోటీలలో పాల్గొనేందుకు 20మందితో కూడిన జట్టు గురువారం పయనమైంది. ఎస్.సుదర్శన్‌రెడ్డి కోచ్‌గా, డాక్టర్ ఎస్.గఫూర్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్వీయూ మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు డాక్టర్ ఎం.ఎస్.నజరుద్దీన్ పాల్గొని క్రీడాకారులకు దుస్తులు, సామగ్రి పంపిణీ చేశారు.

జట్టులో స్థానం దక్కినవారి వివరాలిలా..

ఆర్.డేనియల్(ఎస్వీపీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ శ్రీకాళహస్తి), కె.మహమ్మద్‌అన్సారీ(శేషాచల డిగ్రీ కాలేజీ పుత్తూరు), బీ.ఉదయ్‌కిరణ్‌రెడ్డి(వింగ్ బిజినెస్ స్కూల్ తిరుపతి), ఆర్.ఒనీష్‌రెడ్డి(సీకాం డిగ్రీ కాలేజీ తిరుపతి), ఎస్.మహమ్మద్‌బాషా(మదర్‌థెరీసా ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ పలమనేరు), ఎ.దిలీప్, టి.ఉదయ్‌కిరణ్, కే.శ్రీనివాసులు(గవర్నమెంట్ డిగ్రీకాలేజీ పుత్తూరు), ఎం.నరసింహులు, డి.చంద్రశేఖర్, వి.హరీష్, ఎం.మహేష్, వి.రేవంత్‌బాబు(ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ, తిరుపతి), సి.అశోక్, జి.ధనుష్‌వంశి(గేట్ డిగ్రీ కాలేజీ తిరుపతి), ఎస్.విజయ్, ఆర్.హెచ్.ప్రశాంత్(సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తిరుపతి), బి.వెంకటబాలాజీ(ఎస్వీయూ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్), ఎస్.మహమ్మద్‌ఉజైర్(శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ మదనపల్లి), ఆర్.శిబిరాజ్(గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ నగరి).

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. లక్షదీప్ గవర్నర్ ప్రఫుల్ ఖోడా పటేల్, తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, మాజీ జేఈవో శ్రీనివాసరాజు, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భుషణ్ ప్రసాద్ సింగ్, హిమాచల్‌ప్రదేశ్ లోకాయుక్తా జస్టిస్ సీబీ బరావలియా ఉన్నారు.





ప్రఫుల్ ఖోడా పటేల్ - జస్టిస్ భుషణ్ ప్రసాద్ సింగ్



తలసాని శ్రీనివాసయాదవ్, పుట్టా సుధాకర్‌యాదవ్



సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్ట్‌మెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.16 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,457

తలనీలాలు సమర్పించినవారు : 22,152

గంటలోపే దర్శనం



అన్నేసి గంటలు క్యూలో ఉండడం మానవహక్కుల ఉల్లంఘనే

చైర్మన్ అనే హోదాను అనుభవించడానికి నేనీ బాధ్యత స్వీకరించలేదు. స్వామి కొలువు గొప్పవరం. తిరుమలకు వచ్చే వెళ్లే ప్రయాణం, బస, భోజనం వంటి ఖర్చులు ఏవీ టీటీడీ మీద భారం మోపడం లేదు. సొంతంగా నేనే పెట్టుకుంటున్నా. దర్శనాల కోసం చైర్మన్ మీద ఎంత ఒత్తిడి ఉంటుందో అందరికీ తెలుసు. అయినా.. దర్శన టికెట్ల కోటాను కూడా నేను వినియోగించుకోవడం లేదు.

టీటీడీకి వచ్చే ఆదాయానికంటే, చేసే ఖర్చే అధికంగా ఉంటోంది. మళ్లీ కుబేరుడివంటి వారిని వెతుక్కుని అప్పు చేయాలి. అలా చేసి పెట్టారు టీటీడీని. వ్యక్తిగత పనులన్నీ వదిలేసి తిరుమలలోనే ఉంటూ అన్నింటిపై దృష్టి సారించా. స్వామికి చెందిన ఒక్క రూపాయి కూడా వృథా కానివ్వను.

తిరుమల ప్రక్షాళన మొదలైంది

ఆక్రమించిన మఠాల జోలికే వెళ్తాం!

తిరుమలలో 30 దుకాణాలు తిరిగితే కనీసం శ్రీవేంకటేశ్వరస్వామి ఉండే ఉంగరాలు దొరకవు కానీ, శిలువ బొమ్మ లుండే కడియాలు ఉంటున్నాయి. దుకాణాల వ్యవహార తీరును కూడా మార్చాలి.

INTERVIEW

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఆయన వెంట మందీ మార్బలం కనిపించదు. ఆర్భాటం అసలు ఉండదు. హడావుడి లేదు. తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆయన శైలి విలక్షణం. ఒక సాధారణ భక్తుడిలా తిరుమల అంతా కలియతిరుగుతుంటారు. భక్తులతో మాట్లాడతారు. దుకాణాలను పరిశీలిస్తారు. ఒక రీసెర్చర్‌లా వివరాలు తెలుసుకుంటారు. ఆ తర్వాత అధికారులతో మాట్లాడతారు. గుర్తించిన లోపాలు వివరించి సరిదిద్దుకునే అవకాశాలేమిటని ఆరా తీస్తారు. సీఎం చంద్రబాబు ఆకాంక్షను నెరవేర్చే దిశగా తిరుమల ప్రక్షాళనకు పూనుకున్నారు టీటీడీ కొత్త చైర్మన్ బీఆర్ నాయుడు. పెనుమూరు మండలం దిగువపూనేపల్లిలో పుట్టి పెరిగిన ఈయన తొలుత బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగం చేశారు. ఆ తర్వాత వ్యాపార వేత్తగా స్థిరపడ్డారు. నవంబరు 6న టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడు గత చైర్మన్లకు భిన్నంగా తన ఖర్చులన్నీ తనే పెట్టుకుంటూ తిరుమలలో ఉంటున్నారు. తిరుమలలో భక్తుల కష్టసుఖాలు తెలుసుకుంటూ, టీటీడీ అనుపానులు గ్రహిస్తూ ఆచితూచి అడుగేస్తున్న బీఆర్ నాయుడితో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

? చైర్మన్ కావాలని ఎప్పుడు అనిపించింది. ఎందుకు.

! దాదాపు పదిహేనేళ్ల కిందటే టీటీడీ ధర్మకర్తల మండలికి చైర్మన్ కావాలని కోరుకున్నా. చిత్తూరు జిల్లాలో పుట్టిపెరిగిన వాడిగా ఇక్కడుండే సమస్యలన్నీ నాకు తెలుసు. నేను చైర్మన్ అయితే మార్పులు చేయగలనని చిన్న ఆశ. స్వామి ఇచ్చిన ఈ అవకాశాన్ని గొప్పవరంగా భావిస్తున్నా. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ తిరుమలకు వస్తూనే ఉన్నాను. శ్రీవేంకటేశ్వర స్వామి మీద అచంచల భక్తి చిన్నప్పటి నుంచే ఉంది.

? గతంలో దర్శనానికి ఎప్పుడైనా ఇబ్బంది పడ్డారా.

! 10 గంటలకుపైనే క్యూలైన్‌లో వేచి ఉండి స్వామిని దర్శించుకున్న సందర్భాలున్నాయి. ఒక్కోసారి క్యూలైన్‌లో వెళ్లే సమయం లేక పుష్కరిణిలో కాళ్లు కడుక్కొని, తలపై చల్లుకుని, కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయేవాడిని. గొల్లమండం నుంచే స్వామికి నమస్కరించుకుని ఈసారికి ఇదే భాగ్యం అనుకునేవాడిని. గతంలో గవర్నమెంట్ సర్వీస్‌లో ఉండేవాడిని. సెలవులు తక్కువ. టైం ఉండదు కాబట్టి అన్నేసి గంటలు క్యూలో ఉండే వీలుండేది కాదు.

? చైర్మన్‌గా తిరుమలలో మీరు గుర్తించిన లోపాలేంటి.

! ప్రధానంగా స్వామి దర్శనానికి వచ్చే వారిని 20 నుంచి 30 గంటల పాటు కంపార్టుమెంట్లలో కూర్చోబెట్టి తాళాలు వేసేస్తున్నారు. లోపలికి రానివ్వరు, బయటకు పోనివ్వరు. నా దృష్టిలో అది కరెక్ట్ కాదు. మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందని గతంలో కూడా చెప్పాను. భక్తులు చాలా ఇబ్బందులు పడటాన్ని స్వయంగా చూశా. ఐదు కిలోమీటర్ల పొడవుతో ఉన్న క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి నిలుచుంటున్నారు. వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు. అంతదూరం నడిపించాల్సిన అవసరం ఏమిటి? అలాగే వ్యర్థాల తొలగింపు సరిగా జరగడం లేదు. కుప్పలుకుప్పలుగా చెత్త పేరుకుపోయింది. చెత్త తొలగింపునకు ఒక సంస్థకు రూ.20 కోట్లకు కాంట్రాక్ట్ ఇచ్చారు. వారి నిర్వహణ సరిగా లేదు. డబ్బులు ఇచ్చిమరీ చెత్తను తీసుకెళ్లేవారు ఉంటే, వాళ్లను వదిలేసి మనమే డబ్బు ఇచ్చి చెత్త తీసుకువెళ్లండి అనడం ఏమిటో! ఆసంస్థను మార్చాలనుకుంటున్నాం. ఇక, స్విమ్స్ ఆస్పత్రికి ఏడాదికి రూ.వంద కోట్లు టీటీడీ ఇస్తోంది. ఈ అంశంపై తగిన సూచనల కోసం మాజీ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ఓ కమిటీని వేశాం. స్విమ్స్ నిర్వహణే సక్రమంగా లేదనుకుంటే, కమీషన్ల కోసం కక్కుర్తిపడి గతంలో పిల్లల ఆస్పత్రి, క్యాన్సర్, హార్ట్ ఆస్పత్రి అని పెట్టారు. ఇవన్నీ అవసరమా?. రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.1,200 కోట్లు పెట్టి భవనాలు కడుతున్నారు. కట్టి ఏం చేస్తారు. టీటీడీ పని అదేనా? ఆలయాలు లేని చోట కట్టించాలి. నైవేద్యం లేని చోట ఏర్పాట్లు చేయాలి. భజనలు, హిందు ధర్మప్రచార కార్యక్రమాలు చేయాలి. దాని కోసం కదా టీటీడీ ఖర్చు చేయాల్సింది.

? ఆభరణాలు, బంగారు నిల్వలు భద్రంగానే ఉన్నాయా.

! అన్నీ సేఫ్‌గానే ఉన్నాయి. ఎలాంటి సందేహాలు అవసరం లేదు.

? ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ ఎందుకు.

! ఉద్యోగుల్లో కొంతమంది భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. కొందరైతే బూతులు మాట్లాడుతున్నారు. వాదవివాదాల్లో భక్తులపైకి కొట్టేందుకు కూడా కొందరు వెళ్లిపోతున్నారు. అటువంటి వాళ్లను భక్తులు ఎలా గుర్తుపట్టాలి?. అందుకే నేమ్ బ్యాడ్జీ ఉంటే భక్తులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఉంటుంది. ఆ తర్వాత విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. దీనిపై బోర్డులో చర్చించి త్వరలోనే అమలుచేస్తాం.

? ఎలాంటి మార్పులు చేయాలనుకుంటున్నారు.

! ఎయిర్‌పోర్టులో డిజి యాత్ర విధానాన్ని అందరూ చూసే ఉంటారు కదా. అదే తరహాలో ఏఐ సహకారంతో తిరుమల శ్రీవారి దర్శనాన్ని కూడా గంట వ్యవధిలోనే చేయించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భక్తుడు తిరుపతికి రాగానే ఆధార్‌కార్డును లింక్ చేసి ఫేస్‌రికగ్నిషన్‌తో టోకెన్ జారీ చేస్తాం. అందులో టైం వచ్చేస్తుంది. ఆ సమయానికి క్యూకాంప్లెక్స్ వద్దకు వస్తే నేరుగా లోపలికి వెళ్లిపోవచ్చు. వేర్వేరు ప్రాంతాల్లో కావాల్సినన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తే తోపులాటలు కూడా ఉండవు. ఇప్పటికే ఇతర దేశాలకు చెందిన ఐదారు సంస్థలు ఈ వ్యవస్థ ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాయి.. ఉచితంగా చేస్తామంటున్నారు. త్వరలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తాం. సత్ఫలితాలు వస్తే రెండు మూడు నెలల్లోనే అమలుచేస్తాం. ఏఐ అందుబాటులోకి వస్తే వసతికి ఇబ్బందులు కూడా ఉండవు.

? టీటీడీలో అన్యమత ఉద్యోగుల తొలగింపు సాధ్యమేనా.

! వంద శాతం సాధ్యమే. మనం వాళ్ల పొట్టపై కొట్టడం లేదు. ప్రత్యామ్నాయాలు ఉన్నాయి కదా. ముందు మంచి బెనిఫిట్స్‌తో వీఆర్ఎస్ ఇస్తాం. లేకుంటే ప్రభుత్వానికి డిప్యూటేషన్‌పై సరెండర్ చేస్తాం. వాళ్లు కూడా వద్దంటే వేరే ఆలయాలు ఉన్నాయి కదా. జమ్ము, ముంబై, కన్యాకుమారి వంటి వాటికి మారుస్తాం. పేరేమో వెంకటేశ్వరరావు అని ఉంటుంది. కానీ తిరుపతిలో చర్చిలు నిర్వహిస్తూ ఉంటారు. ఇంట్లోనే చర్చి ఉంటుంది. ఏం చేయాలి వాళ్లని? భక్తన్నా ఉండాలి.. లేదా భయమైనా ఉండాలి. వాళ్లకి ఆ రెండూ లేవు.

? టీటీడీ డిపాజిట్ల మళ్లింపు ప్రక్రియ ఏదశలో ఉంది.

! దాదాపు రూ. 4,800 కోట్లు ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్నాయి. ప్రస్తుతం వాటి జోలికి వెళ్లం. కాలపరిమితి పూర్తవగానే భద్రత కోసం జాతీయ బ్యాంకులకు మళ్లిస్తాం. ఇక కొత్త డిపాజిట్‌లు అన్నీ మాత్రం జాతీయ బ్యాంకుల్లోనే వేస్తాం.

? తిరుమలలో మఠాల నిర్వహణపై మీ స్టాండ్ ఏమిటి.

! అదో తేనె పుట్ట. ఎన్నో ఏళ్ల నుంచా ఉన్న వాళ్లను ఎలా ఇబ్బంది పెడతాం. మఠాధిపతులు, పీఠాధిపతులు అందరు ఉన్నారు ఇక్కడ. కొన్ని మఠాలు వ్యాపార కేంద్రాలుగా మారిపోతున్నాయనే విమర్శలు వస్తునే ఉన్నాయి. టీటీడీ కేటాయించిన స్థలాల్లో కాకుండా అదనపు స్థలాలను ఆక్రమించుకుంటే మాత్రం.. వాటిపై చర్యలు తీసుకుంటున్నాం.

? టీటీడీలో ప్రక్షాళన చేస్తామని సీఎం అన్నారు. ఆదిశగా ఏం చేస్తున్నారు

! గతంలో జరిగిన కొన్ని అక్రమాలపై ఇప్పటికే ప్రభుత్వం స్టేట్ విజిలెన్స్‌తో విచారణ చేయిస్తోంది. నెయ్యి కల్తీ వ్యవహారంపై కూడా సిట్ వేగంగా దర్యాప్తు చేస్తోంది. దానిపై ఇప్పట్లో ఏం మాట్లాడలేం. రిపోర్టులు వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకుంటాం. గతంలో సివిల్ వర్క్స్ విపరీతంగా చేశారు. స్వామి డబ్బులంతా సివిల్ వర్క్స్ కోసం వెళ్లిపోతున్నాయి. ముందు ఆపనుల్ని ఆపేయాలి. ఉన్న భవనాలను కూల్చేసి కొత్తవి కట్టడం అవసరమా? టీటీడీకి వచ్చే ఆదాయంలో ఒక శాతం తిరుపతి మున్సిపాలిటీకి ఇవ్వాలంట. ఎందుకు ఇవ్వాలి? ఇవన్నీ రానున్న బోర్డులో చర్చిస్తాం. దేవుడు సొమ్ము ఇలా దుర్వినియోగం అయితే ఎలా? వందల మైళ్ల నుంచి వచ్చి స్వామిని దర్శించుకుని వందో రెండొందలో హుండీలో వేస్తారు భక్తులు. కమీషన్ల కోసం వారి భక్తిని ఇలా దుబారా చేస్తే ఎలా. అందుకే తిరుమల నుంచి ప్రక్షాళన చేస్తామని సీఎంగారు చెప్పారు.

? టూరిజం టికెట్ల కోటా రద్దు వెనుక కారణం.

! రూ.300 టూరిజం టికెట్‌ను అధిక ధరకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. నేనే స్వయంగా రూ.3,300 పెట్టి కొనుగోలు చేశాను. విజిలెన్స్ వాళ్లకు చెప్పాను. వాళ్లు కూడా రూ.300 టికెట్‌ను రూ.3,300 కొన్నారు. దీంతో టూరిజం కోటానే రద్దు చేశాం. తిరుమలలోని కొన్ని దుకాణాల్లోనూ దర్శన టికెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు తెలిసింది. దానిపై కూడా నిఘా పెట్టాం.



కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నారు. నాటి సరదాలే కాదు.. చిన్న వయసులోనే పెళ్లయిన అమాయకత్వాన్ని, ఏమీ తెలియనితనం నుంచి భర్త చంద్రబాబు దన్నుతో హెరిటేజ్ సారథిగా సాధించిన విజయాలను తలపోశారు. అన్న బాలకృష్ణ డైలాగ్‌ను వల్లించారు. కుమారుడు లోకేశ్ బాల్యాన్ని, పెద్దయ్యాక ఆయనకు చేసిన ఉద్బోధను ఏకరువు పెట్టారు. మొత్తంమీద నారా భువనేశ్వరి చిత్తూరు జిల్లా కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మమేకమై వారిలో ఒకరిగా మారిపోయారు. విద్యార్థులతో ముఖాముఖి సందర్భంగా ఇచ్చిన సమాధానాలలో కాసేపు సరదాగా, కాసేపు సీరియస్‌గా, ఇంకాసేపు గంభీరంగా ఆమె చాలా అంశాలు ప్రస్తావించారు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

సరదా సరదాగా..!

విద్యార్థులతో మమేకమైన నారా భువనేశ్వరి

- మిమ్మల్ని చూస్తుంటే నాకు నా కాలేజ్ డేస్ గుర్తుకొస్తున్నాయి. నేనూ మీలాగే సరదాగా ఉండేదాన్ని. కానీ చదువుకుంటుండగానే నాకు చంద్రబాబుతో పెళ్లయిపోయింది. ఆ వయసులో నాకు ఏమీ తెలియదు. అయినా నామీద నమ్మకంతో నా భర్త చంద్రబాబు హెరిటేజ్ ఎండీని చేశారు. ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేశా. ఇప్పుడీ స్థితికి చేరుకున్నా. ఎవరైనా సరే, కష్టపడనిదే విజయం ఊరికే రాదు.
- నా హీరో చంద్రబాబు. ఆయన విజనరీ నాకు ఆదర్శం. భార్యాభర్తల్లో ఎవరైనా ఎదగాలంటే ఎవరో ఒకరు త్యాగం చేయాలి తప్పనిసరిగా. ఆయన నాకిచ్చే సమయం ఉదయం 8.30 గంటలకు. తర్వాత ఆయన తన బాధ్యతల్లో మునిగిపోతారు. ఏదైనా అవసరమై ఫోన్ చేయాలన్నా, పీఏకి చేయాల్సిందే. ఆయన ఫోన్ ఎత్తరు.
- నేను లోకేశ్ విషయంలో చాలా స్ట్రిక్ట్. నన్ను హిట్లర్ అని పిలిచేవాడు. తన స్నేహితులకు కూడా అలాగే చెప్పేవాడు. చంద్రబాబు రాష్ట్రంకోసం, ప్రజలకోసం పనిచేస్తుంటే సింగిల్ మదర్‌గా పెంచానేమో, లోకేశ్‌ను చాలా క్రమశిక్షణలో పెట్టేదాన్ని.
- నాడు, నేడు రాజకీయాల్లో ఒక తేడా ప్రధానంగా కనిపిస్తోంది. ఒకప్పుడు లీడర్‌కు అనుచరులు పూర్తి విశ్వాసంగా ఉండేవారు . నేడు ఆ విశ్వాసం, బాధ్యత తగ్గిందనిపిస్తోంది. లోకేశ్ బాబు ప్రజలకు న్యాయం చేస్తాడు. నేను హామీ ఇస్తున్నా.
- నేను సినిమాలు చాలా తక్కువ చూస్తా. బాలయ్య మూవీలో ఏది నచ్చిందంటే చెప్పలేను. చూసినంతలో సమరసింహారెడ్డి నచ్చిందని చెప్పవచ్చు. డైలాగ్స్ నాకు రావు. అయినా వచ్చినంత చెబుతాను. ఒకేవైపు చూడు, మరోవైపు చూడబాక అనే డైలాగ్. ఏ విషయంలోనైనా ఫోకస్డ్‌గా ఉండాలి. అప్పుడు విజయం వరిస్తుంది. అదే ఈ డైలాగ్‌లో చెప్పారేమో.
- నేను హైలెవల్ పర్ఫెక్షనిస్ట్‌గా ఉండాలనుకుంటా. అంటే ఏ చిన్న లోపమూ కనిపించకూడదు. ఈ క్రమంలో చాలా అలసిపోతా. ధ్యానం నా స్ట్రెస్ బస్టర్. ఉదయం, సాయంత్రం మెడిటేషన్ చేస్తా. ఇంకా మనవడున్నాడు నాకు. వాడితో టైం స్పెండ్ చేస్తే కూడా ఒత్తిడి తగ్గిపోతుంది. వాడికి అయిదు సంవత్సరాలు వచ్చేవరకు నా మాట వినేవాడు. ఇప్పుడు నేను ఏం చెప్పినా వినడం లేదు. నాతో ఫైటింగ్ ఎక్కువ. ఎందుకొచ్చిన గొడవని వాడి మాట వినడం అలవాటు చేసుకున్నా.
- నాకు మ్యాథ్స్ ఇష్టం లేదు. హిస్టరీ ఇష్టం. చంద్రబాబు ఎకనామిక్స్ పీజీ చేశారు. ఆ సబ్జెక్టు కూడా ఇష్టం లేదు. చాలా డ్రై సబ్జెక్టు. ఆయన ఎలా మ్యానేజ్ చేశారో.
- నాకు మొదట్లో కుక్స్ లేరు. నేనే వంట చేసేదాన్ని, డ్రైవింగ్ కూడా నేనే. మా ఆయనకు డబ్బులు సేవ్ చేసేదాన్ని. ఇప్పటికి కూడా నేను 20-30 మందికి వంటచేసి వడ్డించగలను. అయితే లోకేశ్ చిన్నప్పుడు నామీద ఒకటే కంప్లయింట్ చేసేవాడు. ఎవరైనా అడిగితే మా అమ్మ ఏమీ చేయలేదు. ఒట్టి రసమన్నం పెడుతుంది అనేవాడు. నేను ఇల్లు ఊడుస్తుంటే బెడ్ కిందనుంచి బర్గర్ల బాక్స్‌లు బయటపడేవి. వాడికి బర్గర్లు, స్నాక్స్ అంటే అప్పట్లో చాలా ఇష్టం. ఫ్రెండ్స్‌తో తెప్పించుకునేవాడేమో.ఇప్పటికీ లోకేశ్‌తో ఆ విషయం గురించి చెప్పి, నవ్విస్తుంటా.
- నాకు బహుమతుల మీద ఆశలేదు. ఆయనను ఎప్పుడూ వాటిని గురించి అడగను. అయితే మా ఫ్రెండ్ హజ్బెండ్ ఒకరు మ్యారేజ్ యానివర్శరీకి ఆవిడకు డైమండ్ రింగ్ కొని ప్రజంట్ చేశారట. నాకు చెప్పింది. నేను కూడా మా యానివర్శరీకి డైమండ్ రింగ్ కొనమని అడిగాను. నువ్వే ఒక డైమండ్, నీకు ఇంకా వేరే డైమండ్ ఎందుకన్నారు. అలా చాకచక్యంగా తప్పించుకున్నారన్న మాట. అంతే, అప్పటి నుంచి నేను ఆయననుంచి ఏ బహుమతులూ కోరలేదు.



కుటుంబ కలహాలతో మహిళ హత్య

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు మహిళ హత్యకు దారితీశాయి. ఈ ఘటన గురువారం తిరుపతి నగరంలో చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. సింగాలగుంటకు చెందిన ద్రాక్షాయణి నాలుగు ఇళ్లలో పాచి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె కుమారుడు పురుషోత్తం, కోడలు నాగలక్ష్మి భవానీనగర్‌లో కాపురముంటున్నారు. కొన్ని రోజులుగా వీరిద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. బుధవారం రాత్రి భర్త గొడవపడుతుండడంతో నాగలక్ష్మి తన సోదరుడు విజయ్‌కు విషయం చెప్పింది. తల్లి మాటలు వినడం వల్లే పురుషోత్తం తన చెల్లితో గొడవపడుతున్నాడని భావించిన విజయ్ శింగాలగుంటకు వెళ్లి ద్రాక్షాయణిని కత్తితో నరికాడు. రక్తపు మడుగులో పడిపోయిన ఆమెను స్థానికులు దగ్గర్లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



మృతి చెందిన ద్రాక్షాయణి

అన్న మృతిపై తమ్ముడి అనుమానం

- ఖననం చేసిన మృతదేహానికి ఆరు నెలల తర్వాత పోస్టుమార్టం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): అన్న మృతిపై అనుమానాలు ఉన్నాయని తమ్ముడు ఫిర్యాదు చేశాడు. దీంతో ఖననం చేసిన మృతదేహానికి ఆరు నెలలకు పోస్టుమార్టం నిర్వహించారు. తొట్టంబేడు మండలం దొంగలముడూరు గ్రామానికి చెందిన ఉదయ్‌కమార్(40).. బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాల గ్రామ చెరువు దగ్గర జూన్ 21న మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో క్రైస్తవ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ క్రమంలో ఉదయ్‌కుమార్ మృతిపై తమ్ముడు భానుప్రసాద్‌కు అనుమానం కలిగింది. హత్య చేసి ఉంటారని భావించి గురువారం బీఎన్‌కండ్రిగ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ విశ్వనాథనాయుడు.. దొంగలముడూరు గ్రామానికి చేరుకున్నారు. తహసీల్దార్ మధుసూదన్ రావు సమక్షంలో మృతదేహానికి డాక్టర్లు హరిత, జ్యోతిప్రసూన పోస్టుమార్టం నిర్వహించారు.

ఎల్ఏ ఆర్ అండ్ ఆర్ అథారిటీ న్యాయవాదిగా ఆదినారాయణ

తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న ల్యాండ్ అక్విజేషన్ రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ అథారిటీకి ప్రభుత్వ న్యాయవాదిగా తిరుపతికి చెందిన శాకమూరి ఆదినారాయణ నియమితులయ్యారు. రాయలసీమ జిల్లాల పరిధిలో భూ సేకరణ వివాదాలకు సంబంధించిన కేసులు ఈ అథారిటీ ఎదుట విచారణకు వస్తుంటాయి. ఆ కేసుల్లో ప్రభుత్వ న్యాయవాదిగా ఆదినారాయణ వ్యవహరించనున్నారు. ఆయన సంబంధిత పదవిలో ఏడాదిపాటు కొనసాగుతారని ప్రభుత్వం గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

25కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు

రేణిగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలో 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని.. ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. కొత్త చెక్‌పోస్టు సమీపంలో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని తనిఖీ చేశారు. వారి వద్ద 25 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించారు. గంజాయి విలువ రూ.2.5 లక్షలు ఉంటుంది. నిందితులు తారక రామానగర్‌కు చెందిన సక్కుబాయి, తిరుపతి సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన కట్టమంచి చిరంజీవిగా గుర్తించారు. వీరు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి రేణిగుంట, తిరుపతి ప్రాంతాల్లో విక్రయిస్తుంటారని గుర్తించారు. కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వరసిద్ధుడి ఆలయంలో అయ్యప్ప భక్తుల సందడి




క్యూలైన్లలో వేచి ఉన్న అయ్యప్ప భక్తులు - కాణిపాకంలో అయ్యప్ప భక్తుల సందడి

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం గురువారం అయ్యప్ప భక్తుల భక్తుల రద్దీతో కిక్కిరిసింది. వేకువ జాము నుంచే అయ్యప్ప భక్తులతోపాటు సామాన్య భక్తులు తరలివచ్చారు. రూ.100, రూ.150 క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం కల్పించడానికి ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం వరకు రద్దీ కొనసాగింది. స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది.

రూపాయి స్టాంపుపై రూ.50 బాదుడు!

యూజర్ చార్జీలతో జనం విలవిల ● గత పాలకుల తప్పిదమే కారణం

● యాదమరికి చెందిన అరుణ్ కుమార్ తన స్నేహితుడి వద్ద అప్పు తీసుకున్నారు. ప్రామిసరీ నోట్ మీద అంటించడానికి రెవెన్యూ స్టాంపు కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. రూపాయి స్టాంపు ఇవ్వాలని కోరగా రూ.50 యూజర్ చార్జీ అవుతుందనడంతో ఆయన ఖంగుతిన్నాడు.

● శ్యామ్ కుమార్ తన అభ్యర్థన రాసుకుని రెండు రూపాయిల అర్జీ బిళ్ల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా యూజర్ చార్జీ నిమిత్తం రూ.50 చెల్లించాలని సిబ్బంది చెప్పడంతో దిక్కుతోచక ఆయనా వెనుదిరిగాడు.

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యూజర్ చార్జీలంటూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. 'పావలా కోడికి ముప్పావలా మసాలా' అన్న చందాన ఇవి ఉండడంతో కక్షిదారులకు దిక్కుతోచడం లేదు. జిల్లాలో బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, చిత్తూరు రూరల్, చిత్తూరు ఆర్వో, కార్వేటినగరం, నగరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. గత ప్రభుత్వం 2023 ఏప్రిల్‌లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో చెల్లించాల్సిన యూజర్ చార్జీలను భారీగా పెంచుతూ జీవో జారీచేసింది. దీని ప్రకారం రూ.5,000 వరకు కొనుగోళ్లకు సంబంధించిన స్టాంపులపై రూ.50 యూజర్ చార్జీల రూపేణ కక్షిదారుల నుంచి వసూలు చేయాలని ఆదేశించింది. అయితే రూ.1, రూ.10, రూ.50 వరకు పూర్తయ్యే అవసరాలకు కూడా ఇంత పెద్ద మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని జనం వాపోతున్నారు.

దిక్కు తోచని స్థితిలో..

సాధారణంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అతి తక్కువ నగదుకు సంబంధించిన స్టాంపులతోనే నోటు, అర్జీ, దరఖాస్తు, అఫిడవిట్, నకళ్లు వంటి వివిధ అవసరాలు తీరుతాయి. ఇలాంటి వాటికి కూడా రూ.50 చెల్లించమనడం ఏమిటని కక్షిదారులు ప్రశ్నిస్తున్నారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసేందుకు రూ.10 నాన్-జ్యుడీషియల్ స్టాంపుకోసం వెళితే ముక్కుపిండి రూ.50 యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. యూజర్ చార్జీల మోతను తప్పించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులకు విశేష ఆదరణ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల ఆరో తేదీనుంచి ప్రారంభమైన రెవెన్యూ సదస్సులకు విశేష ఆదరణ లభిస్తోంది. గురువారం నాటికి 22,736 మంది రైతులు పాల్గొనగా, చాలామంది తమ భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. గురువారం 317 మంది అర్జీలు ఇచ్చారు. ఇంతవరకు సదస్సుల్లో అందిన అర్జీల సంఖ్య 5982కు చేరాయి. వీటిలో 13 అర్జీలను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. ఇంతవరకు 339 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో జిల్లాలోని కేవలం ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాల వారీగా.. గుడిపాలలో 5.2, నగరిలో 3.4, విజయపురంలో 1.8, నింద్రలో 1.2, పాలసముద్రంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

టీడీపీ జీవిత కాల సభ్యత్వ నమోదులో 'గంగాధర నెల్లూరు'కు రెండో స్థానం

వెదురుకుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జీవిత కాలం సభ్యత్వ నమోదులో గంగాధరనెల్లూరు నియోజకవర్గం గురువారం రాత్రికి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. టీడీపీ సాధారణ సభ్యత్వానికి రూ. 100, జీవిత కాలం సభ్యత్వ నమోదుకు రూ. లక్ష చెల్లించాలి. ఈ నేపథ్యంలో 71 మంది జీవిత కాలం సభ్యత్వంతో మంగళగిరి నియోజకవర్గం ప్రథమ స్థానం, 38 మంది జీవిత కాలం సభ్యత్వం తీసకోవడంతో గంగాధరనెల్లూరులో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది.

అడవి పందుల దాడిలో రైతన్నకు గాయాలు

సోమల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సోమల మండలం పేటూరు పంచాయతీ బోనమంద సమీపంలో టమోటా రైతు శంకరయ్య పొలం వద్ద ఒంటరిగా కాపుగాస్తుండగా అడవి పందులు దాడిచేసి తీవ్రంగా గాయపర్చినట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొద్దిరోజులుగా టమోటా తోటలోకి అడవి పందులు వచ్చి పంటలను నష్టపరుస్తుండటంతో పొలం వద్దకు బుధవారం రాత్రి వెళ్లాడు. అడవి పందులు రాకుండా ఉండేందుకు మంటలు వేసుకున్నాడు. ఈ క్రమంలోనే శంకరయ్య నిద్రిస్తుండగా అడవి పందులు మూకుమ్మడిగా పొలంలోకి జొరబడ్డాయి. వాటిని అడ్డుకునే క్రమంలో శంకరయ్యపై అడవి పందులు దాడి చేసి గాయపరిచాయి. సమీపంలో ఉన్న తోటి రైతులు గాయపడ్డ అతడిని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కోసం చేర్పించారు.

పాల వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి



మృతి చెందిన నేత్ర

బంగారుపాళ్యం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని పాల వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండంలోని చిల్లగుండ్లపల్లె గ్రామానికి చెందిన ధరణీ బాబు కుమార్తె నేత్ర (3) ఇంటి ముందు ఆడుకుంటుండగా పాల వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారి తలకు తీవ్ర గాయమైంది. కుటుంబీకులు వెంటనే సీఎంసీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

పుత్తూరులో పిచ్చికుక్క వీరంగం



కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్న బాధితులు

పుత్తూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో పిచ్చికుక్క దాడిలో పలువురు గాయపడ్డారు. గురువారం అంబేద్కర్ కూడలిలో ఓ పిచ్చికుక్క హఠాత్తుగా పాదచారులపై దాడికి దిగింది. దాదాపు పది మంది గాయపడ్డారు. దారిన వెళ్లే వారందరిపై దాడి చేస్తూ సాగింది. మామిడికాయల మండీ వద్ద స్థానికులు దాన్ని కొట్టి చంపేశారు. కాగా పిచ్చి కుక్క బాధితులు కొందరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. యాంటీ రేబిస్ మందులు ఉండడంతో కుక్క కాటుకు గురైన వారికి ఆస్పత్రిలో చికిత్సలు అందజేశారు. కాగా పట్టణంలో కుక్కలతో పాటు పాముల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవలే ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్న ప్రాంతంలో ఓ విద్యార్థి తల్లి పాముకాటుకు గురై మరణించింది. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలతో పాటు పాముల బెడదను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

వేరుశనగ, మామిడి పంట బీమా గడువు పెంపు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈఏడాది రబీలో మామిడి, వేరుశనగ పంటలకు బీమా చెల్లింపు గడువు పెంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈనెల 15 వరకు గడువు ఉండేది. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.30వేలు బీమా కాగా రైతులు రూ.450 ప్రీమియం చెల్లించాలన్నారు. ఎకరా మామిడికి బీమా రూ.35వేలు కాగా రైతులు రూ.1,750 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కౌలు రైతులైతే సీసీఆర్‌సీ పత్రం, రైతు సేవా కేంద్రం జారీ చేసే ధ్రువీకరణ పత్రం, రైతు డిక్లరేషన్, మొబైల్ నెంబరు, రైతు బ్యాంకు ఖాతా మొదటి పేజీ కాపీలను సమీపంలోని సీఎస్‌సీ సెంటర్‌కు తీసుకువెళ్తే వివరాలను నమోదు చేస్తారన్నారు. లేకుంటే నేరుగా ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.

సాయానికి ఎన్టీఆర్ ట్రస్టు సదా సిద్ధం!

● స్కిల్ సెంటర్ విస్తరణ ప్రారంభోత్సవంలో భువనేశ్వరి



ఎన్టీఆర్ ట్రస్టు తరఫున వృద్ధుడికి వినికిడి యంత్రం అమరుస్తూ

కుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాయం చేయడానికి విద్య, ఉపాధి అవకాశాలు అందించడానికి ఎన్టీఆర్ ట్రస్టు సదా సిద్ధంగా ఉంటుందని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలో ఇప్పటికే ట్రస్టు తరఫున నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అదనపు తరగతులను గురువారం ఆమె ప్రారంభించారు. అలాగే ఎన్టీఆర్ సర్కిల్‌లో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని ట్రస్టు తరఫున కుట్టుమిషన్లు, తోపుడు బళ్లు, దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, మూడు చక్రాల వాహనాలు అందజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మహిళలు తయారు చేసిన జూట్ బ్యాగులు, గాజులు పరిశీలించారు. ఉత్పత్తుల మార్కెటింగ్, తయారీ ఖర్చు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ కుప్పం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 164 మందికి కుట్టులో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.ఎంత మంది వచ్చినా శిక్షణ బ్యాచ్‌లవారీగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కుప్పం ఏరియా ఆసుపత్రిలో త్వరలోనే బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు తరపున హైదరాబాదులో సివిల్స్ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరపున ఢిల్లీకి చెందిన క్రాక్ అకాడమీ ద్వారా త్వరలోనే కుప్పంలోనూ ఉచితంగా సివిల్స్ శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు.ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో రాజేంద్ర కుమార్, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధికి మీవంతు సహకారం అవసరం

ప్రజలను కోరిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ ● టీడీఆర్ బాండ్లను ఎక్కడైనా అమ్ముకోవచ్చు




సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్ - తమ గోడును వెళ్లబోసుకుంటున్న గిరింపేట బాధితులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్తూరు అభివృద్ధి చెందాలంటే.. మీ వంతు సహకారం అందించాలని ప్రజలను కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేద్దాం అనే అంశంపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధ్యక్షతన అన్ని వర్గాల ప్రజలతో సలహాల స్వీకరణ కార్యక్రమం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో గురువారం జరిగింది. ముందుగా హైరోడ్డులో స్థలాలు, నిర్మాణాలు కోల్పోయే వారి సమస్యలు, ఇబ్బందులను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో హైవేల నిర్మాణాలు జరుగుతున్నాయి.. అక్కడ కూడా చాలా మంది రైతులు భూములను కోల్పోతున్నారు.. వారికి ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇచ్చిందని, అదే తరహాలో ఇక్కడా పరిహారం ఇప్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. టీడీఆర్ బాండ్లను ఎక్కడైనా అమ్ముకోవచ్చన్నారు. ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ చిత్తూరు నగరాన్ని స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేయడానికి అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్డు వెడల్పుతో భవనాలు, భూములు కోల్పోయే వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తన వ్యక్తిగత అవసరాల కోసం భూములను అడగటం లేదని, చిత్తూరు అభివృద్ధి కోసం ఇవ్వాలన్నారు. పూర్తిగా ఇండ్లు కోల్పోయే వారికి న్యాయం చేసేలా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఇండ్లు కట్టించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జేసీ విద్యాధరి, నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఆర్డీవో శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు త్వరగా భూములు కేటాయించండి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు భూ కేటాయింపులు త్వరగా చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా పరిశ్రమల - ఎగుమతుల ప్రమోషన్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ ప్రసంగించారు. త్వరలో మూడు భారీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 975 దరఖాస్తులు పారిశ్రామికవేత్తల నుంచి అందగా.. 943కి ఆమోదం తెలిపామన్నారు. పీఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా జిల్లా పరిశ్రమల కేంద్రానికి 71 పరిశ్రమల స్థాపన లక్ష్యం కాగా, లక్ష్యానికి మించి 114 యూనిట్ల గ్రౌండింగ్ జరిగిందన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేలో ఇంతవరకు 9,559 యూనిట్ల సర్వే జరిగాయని పరిశ్రమలశాఖ ఏడీ వెంకటరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి, వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, ఫుడ్ ప్రాసెసింగ్ పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ప్రతినిధి గోవర్ధన్ బాబి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరగొండ అపోలోలో భుజం ఎముకల మార్పిడి శస్త్ర చికిత్సలు



మీడియాతో మాట్లాడుతున్న మదన్‌మోహన్ రెడ్డి, కార్తీక్ రెడ్డి

తవణంపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అరగొండ అపోలో ఆస్పత్రిలో భుజం ఎముకల మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు ఏవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. భుజం మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా గురువారం ఆస్పత్రిలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ప్రముఖ ఎముకలు, కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు మదన్‌మోహన్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే గ్రామీణ ప్రాంతం ఆస్పత్రుల్లో భుజం మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించింది తమ ఆస్పత్రే అని చెప్పారు. పట్టణాలకే పరిమితమైన అత్యాధునిక వైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించాలని అపోలో అధినేత ప్రతాప్ సి రెడ్డి తన స్వగ్రామం అరగొండలో అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఈ శస్త్ర చికిత్స చేసుకున్నవారు ఆరు వారాల్లో తమ పనులు తాము చేసుకోవచ్చునని తెలిపారు. వైద్యులు కార్తీక్, శ్రీనివాసులు, పీఆర్వో కమరుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణతో మెరుగైన ఫలితాలు

● డీఎస్సీ అభ్యర్థులతో భువనేశ్వరి



ఉచిత మెటీరియల్ అందజేస్తున్న భువనేశ్వరి

కుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు అందిస్తున్న శిక్షణతో మెరుగైన ఫలితాలు సాధించి ఉపాధ్యాయులుగా మారి విద్యా సేవలు అందించాలని నారా భువనేశ్వరి కోరారు. ఎన్టీఆర్ ట్రస్టు తరఫున కుప్పంలో నడుస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న డీఎస్సీ అభ్యర్థులతో మాట్లాడుతూ 2009లో ట్రస్టు తరఫున డీఎస్సీ కోచింగ్ తీసుకున్న 36మందికి టీచర్ పోస్టులు వచ్చాయన్నారు. 2017లో ఆర్మీ కోచింగ్‌లో 36మంది ఎంపికయ్యారని, 2012 డీఎస్సీ కోచింగ్ విద్యార్థుల్లో 16 మంది, 2017 డీఎస్సీలో 27 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. 2018లో తిరిగి ట్రస్టు తరఫున కానిస్టేబుల్ పరీక్షలకు శిక్షణ తీసుకున్నవారిలో 12 మంది ఉద్యోగాలు పొందారన్నారు. అలాగే ఇప్పుడు శిక్షణ తీసుకుంటున్నవారు కూడా లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఎస్సీ అభ్యర్థులకు భువనేశ్వరి ఉచిత మెటీరియల్ అందజేశారు.

మసీదు ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాల కొనసాగింపు

తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదాయం లేని మసీదుల ఇమామ్‌లకు, మౌజన్లకు చెల్లించే గౌరవ వేతనాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ.. దేశంలోనే తొలిసారిగా ఈ గౌరవ వేతనం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం ఈ ఏడాది మార్చి వరకే ఈ పథకాన్ని అమలు చేసింది. ఆ తర్వాత బడ్జెట్ కేటాయించలేదు. తాజాగా దీనిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం ఇమామ్‌లకు నెలకు రూ. 10 వేలు, మౌజన్లకు నెలకు రూ. 5 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా వర్తింపజేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొనసాగింపు ఏప్రిల్ నుంచీ వర్తిస్తుందని పేర్కొంది.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

జేఏసీ నాయకుల పిలుపు



విద్యుత్ సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని విద్యుత్ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట గురువారం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎల్.చలపతి, వి.గోపి, ఆర్.మురళీధర్, నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయన్నారు. కార్పొరేషన్లుగా విడగొట్టి కార్పొరేటర్లకు అప్పగించడానికి ప్రయత్నిస్తోందన్నారు. విద్యుత్ సంస్థలు ప్రైవేట్ పరమైతే ప్రజలకు రాయితీలు ఉండవన్నారు. పాలకుల కుతంత్రాలను ఉద్యోగులు, ప్రజలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, వంశీ, గోపి, అభినయ్, కార్తీక్, బ్రహ్మానందరెడ్డి, గుణశేఖర్, శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్




గోపి - గంటావూరులో హల్‌చల్ చేసిన ఒంటరి ఏనుగు

పలమనేరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు వద్ద గోపి అనే రైతు ఇటీవల కోతకోసి ఇంటి వద్ద భద్రపరచిన ధాన్యం తినేందుకు విఫలయత్నం చేసింది. ధాన్యం గదికి వున్న పైకప్పు తొలగించేందుకు వీలు కాకపోవడంతో గదికి వేసిన తలుపును తొలగించేందుకు ఏనుగు ప్రయత్నించింది. అలికిడికి మేల్కొన్న గ్రామస్థులు గుంపుగా వచ్చి బిగ్గరగా కేకలు పెట్టడంతో అక్కడి నుంచి పక్కనే వున్న గంగవరం మండల పరిధిలోని మన్నారు నాయనిపల్లి, చిన్నూరు గ్రామాల మీదుగా అడవిలోకి వెళ్లిపోయింది.ఒంటరి ఏనుగు తమ ఇంటి వద్ద ధాన్యం తినేందుకు ప్రయత్నించడంతో భయభ్రాంతులకు గురయ్యామని గోపి పేర్కొన్నాడు.ఇంటిని కూడా కూల్చివేస్తుందని భయపడ్డామని, అంతలోనే గ్రామస్థులు పెద్దసంఖ్యలో వచ్చి బిగ్గరగా కేకలు వేయడంతో ఏనుగు వెనక్కు తగ్గి వెళ్లిపోయిందన్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తమ పంటల మాట దేవుడెరుగు.. తమకు, తమ ఇళ్లకు, పాడిపశువులకు ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పంటలపై ఆగని దాడులు

సోమల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఏనుగుల సంచారం రైతుల కంట కన్నీరు తెప్పిస్తోంది. బుధవారం రాత్రి వడ్డిపల్లెకు చెందిన పలువురి పొలాల్లో ఏనుగుల మంద సంచరించి వరి ధాన్యాన్ని తొక్కివేసినట్లు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. నష్టపోయిన పంటలను పరిశీలించి పరిహారం అందజేయాలని కోరారు. అలాగే ఆవులపల్లె, కొత్తూరు, రాంపల్లె బీట్‌లో తిష్ట వేసిన మరో మూడు ఏనుగులు పొలాల్లో సంచరించి పంటను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. ఇరికిపెంట సమీపంలోని మధురమలై కొండలో కూడడా ఏనుగులు మకాం వేసి పరిసరాల్లో సంచరిస్తున్నాయని చెప్పారు.

బీఆర్డీ నర్సింగ్ హోంలో ఎన్టీఆర్ వైద్య సేవ ప్రారంభం


ఎన్టీఆర్ వైద్య సేవను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి

కుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని బీఆర్డీ నర్సింగ్ హోంలో ఎన్టీఆర్ వైద్య సేవను గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఎందరో పేదలకు ప్రాణ, ఆరోగ్యదానం జరిగిందని చెప్పారు. ఆస్పత్రి నిర్వాహకులు పేదలపట్ల, వారి ఆరోగ్యంపట్ల బాధ్యతగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, బీఆర్డీ నర్సింగ్ హోం యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ బీఆర్డీ సురేశ్‌బాబు, డాక్టర్ హరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, పాలు పంపిణీ


సోమలలో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు

సోమల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమల బస్టాండ్‌లో ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలలో పలువురు రోగులకు పండ్లు, పాలు అందచేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, పీఎం మల్లికార్జున, శివశంకర్, హరిప్రసాద్, మహేంద్రబాబు, సుబ్బరాయుడు, పి.శ్రీనివాసులు, సుబ్రమణ్యం యాదవ్, వైవీ సుబ్బయ్య శెట్టి, సూరిశెట్టి సుధాకర్, అష్రఫ్ అలీ, రమేశ్ నాయుడు, బాలకృష్ణమ నాయుడు, వేణుగోపాల్ నాయుడు, బాలాజీ నాయుడు, పురుషోత్తం, జయచంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి పర్యటనకు చకచకా ఏర్పాట్లు


మొద్దులవంకలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శని, ఆదివారాల్లో రామకుప్పం మండలంలో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పర్యటనను పురస్కరించుకుని టీడీపీ శ్రేణులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని విజలాపురం కేజీబీవీలో విద్యార్థినులతో, మొద్దులవంక, గాంధీనగరంలో, ఆదివారం ఉదయం చెల్దిగానిపల్లెలో మహిళలతో ముఖాముఖి సమావేశాల్లో పాల్గొననున్నారు. ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి గురువారం విజలాపురం కేజీబీవీని సందర్శించి భువనేశ్వరి పర్యటనకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎస్‌ఎంసీ చైర్మన్ షణ్ముగం, ప్రిన్సిపాల్ అమరావతులతో చర్చించారు. అనంతరం మొద్దులవంక, గాంధీనగరం గ్రామంలో సమావేశ స్థలాలను పరిశీలించి, ఏర్పాట్లపై స్థానిక టీడీపీ శ్రేణులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు రామలింగారెడ్డి, మంజునాథరెడ్డి, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, బాలరాజు, అల్లీశీన, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక ప్రతిభావంతుల శిబిరం

పుంగనూరు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించే ప్రత్యేక ప్రతిభాంతుల శిబిరాన్ని విజయవంతం చేయాలని పలమనేరు ఆర్డీవో భవాని కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిభావంతులు ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలు తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రాము, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, సీఐ శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలిన టీడీపీ నాయకులు


చల్లా రామచంద్రారెడ్డికి కేక్ పెడుతున్న రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలకు చౌడేపల్లె నుంచి రొంపిచెర్లకు టీడీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.గురువారం టీడీపీ మండల అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాదిరాజు లక్ష్మణరాజు, ప్రదీప్‌రాజుల ఆధ్వర్యంలో కార్యకర్తలు సుమారు 100 కార్లలో అధిక సంఖ్యలో వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మౌలిక వసతుల రూపకల్పనకే శిక్షణ


శిక్షణకు హాజరైన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది

పెద్దపంజాణి, డిసెంబరు 19: గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల రూపకల్పనకే స్థానికీకరణ సుస్థిర అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు గురువారం ఈఓపీఆర్డీ శారదాదేవి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి 2030 సంవత్సరం లోపు స్థానికీకరణ సుస్థిర అభివృద్ధిలో భాగంగా 9రకాల అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. రాష్ట్రంలో పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. గ్రామాలలో సుపరిపాలన, సామాజిక న్యాయం, స్నేహపూర్వక వాతావరణం, నీటిసమృద్ధి, మెరుగైన జీవన విధానం కల్పించడమే లక్ష్యమన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, మెడికల్ ఆఫీసర్ కరుణాకర్, వెలుగు ఏపీఎం మీరాబాయి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలి

పుంగనూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి అధికారులు కృషి చేయాలని పలమనేరు డీఎల్‌పీవో వెంకటశేషాద్రి అన్నారు. గురువారం స్థానిక ట్రావెల్స్ బంగ్లాలోని జడ్పీగెస్ట్‌హౌస్‌లో జరుగుతున్న శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామాలల్లో తాగునీరు, పారిశుధ్యం అంశాలపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. సురక్షిత నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వాటర్‌బాటిళ్లు సురక్షిత నీరు కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్దనే మరుగుదొడ్లు నిర్మించుకుని మలమూత్ర విసర్జన చేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషిచేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో లీలామాధవి, ఏవో రెడ్డెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చందన, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

చౌడేపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పెద్దయల్లకుంట్ల గ్రామానికి చెందిన వెంకటప్ప కుమారుడు పూలరాజప్ప(53) కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసి, అతడి వద్ద ఉన్న 30 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

పలమనేరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని గురువారం పలమనేరులో పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండు చేశారు. గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండు చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరు ఈశ్వర్, జనవిజ్ఞానవేదిక సీనియర్ నాయకులు కుమారస్వామిరెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్‌రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి, మాట్లాడుతూ సమాజంలో నిమ్నజాతులకు గౌరవ మర్యాదలు, చదువుకొనే అవకాశం కల్పించిన మహనీయుడు బీఆర్ అంబేడ్కర్ అని చెప్పారు. ఇటువంటి మహోన్నత వ్యక్తి పట్ల పార్లమెంట్‌లో అమిత్‌షా అమర్యాదగా మాట్లాడటం క్షమించరాని నేరమని వారు పేర్కొన్నారు.

ఛలో విజయవాడను జయప్రదం చేద్దాం

సోమల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను బీజేపీ పుంగనూరు కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు గురువారం సోమలలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాల ఆదాయాన్ని కేవలం ధర్మప్రచారానికి మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. దేవాలయాల్లో, ట్రస్ట్‌బోర్డుల్లో రాజకీయ పార్టీలతో ప్రమేయం లేని హిందూ దైవ భక్తులు మాత్రమే ఉండాలన్నారు. అనంతరం సోమల, నంజంపేట, ఇరికిపెంట, గన్నావారిపల్లెల్లో కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో శీలం రామూర్తి, శ్రీధర్, విశ్వనాధం నాయుడు, సుబ్రమణ్యం, నవీన్, శ్రీనివాసులు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతి


అహీషా మృతదేహం

పుంగనూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక ఓ మహిళ ఎలుకల మందు తాగి రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడి గురువారం మృతి చెందిన సంఘటన పుంగనూరులో జరిగింది. వివరాలు... పట్టణంలోని ఎంబీటీ రోడ్డు సమీపంలోని ఉర్దూపాఠశాల వద్ద గల మహ్మద్‌హుసేన్ భార్య అహీషా(34) గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రెండు రోజుల క్రితం కడుపునొప్పి తాళలేక ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు అందించారు. బుధవారం రాత్రి కడుపు నొప్పి ఎక్కువ కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంలో సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రక్తదానం చేసిన టీడీపీ కార్యకర్తలు


రక్తదానం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

చౌడేపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో టీడీపీ నాయకుడు మాదిరాజు లక్ష్మణరాజు ఆధ్వర్యంలో చౌడేపల్లె టీడీపీ కార్యకర్తలు గురువారం రక్తదానం చేశారు. మానవ సేవే మాధవ సేవ అని, రక్తదానం చేయటంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చుని చల్లా జన్మదిన వేడుకల్లో టీడీపీ కార్యకర్తలు రక్తదానం చేశారు.

తిరుమలకు భక్తుల పాదయాత్ర

చౌడేపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శెట్టిపేట నుంచి తిరుమలకు పాదయాత్రతో గోవింద మాలధారణ భక్తులు బయల్దేరారు. గురువారం మండలంలోని శెట్టిపేట గ్రామంలోని మోక్షగణపతి ఆలయం వద్ద 30 మంది గోవింద మాల భక్తులు ఇరుముడి కట్టుకుని తిరుమలకు బయల్దేరారు.

ప్రభుత్వ ల్యాబుల్లో 60 రకాల వైద్య పరీక్షలు


డాక్టర్ దీప్‌కుమార్

కుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని టెస్టింగ్ ల్యాబ్‌లను ఉపయోగించుకోవాలని కొత్తపేట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.దీప్‌కుమార్ ప్రజలను కోరారు. వీటిలో 60 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు సదుపాయాలు ఉన్నాయన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తమ ల్యాబ్‌లో లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు కూడా ఉన్నాయన్నారు. ప్రైవేటు క్లినిక్‌లను, ల్యాబ్‌లను ఆశ్రయించి డబ్బులు ఖర్చు చేసుకోవద్దన్నారు. యూహెచ్‌సీలో చికిత్స అందుబాటులో లేకపోతే వందపడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేస్తామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే సందర్భంగా పారిశుధ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. అనిమిగానిపల్లె, చీలేపల్లె, డీకే.పల్లె 1,2, కుప్పం 1,2, సచివాలయాలు కొత్తపేట యూహెచ్‌సీ పరిధిలోకి వస్తాయన్నారు. ప్రస్తుతం నాన్ కమ్యూనల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వే జరుగుతున్నదన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ వంటివాటిని సర్వేలో గుర్తిస్తున్నామన్నారు. 18 శాతం సర్వే పూర్తయిందన్నారు. గత నెలలో ఆర్‌బీఎస్‌కే సర్వే ప్రారంభించామని ఆయన వివరించారు.


కుప్పం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి

బైరెడ్డిపల్లెలో కోతులు, కుక్కల స్వైరవిహారం


బైరెడ్డిపల్లెలో సంచరిస్తున్న కుక్కలు, వానరాలు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలో గత కొంతకాలంగా కోతులు, కుక్కల బెడద విపరీతం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో కోతులు, కుక్కలు స్వైరవిహారం చేస్తూ దడపుట్టిస్తున్నాయి. కోతులు దర్జాగా ఇళ్లలో ప్రవేశించి చేతికందినవి పట్టుకుపోతుండడంతో వాటిని నివారించడానికి ప్రయత్నిస్తే ఎదురుతిరిగి కరుస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ఇదేవిధంగా కుక్కలు కూడా వీధుల్లో గుంపులు, గుంపులుగా సంచరిస్తూ కరవడంతో ఇప్పటికే పలువురు బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు కుక్కకాటుకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి బైరెడ్డిపల్లెలో కోతులు, కుక్కల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చల్లా రామచంద్రారెడ్డితో మురళీధర నాయుడు తదితరులు-రొంపిచెర్లలోని ఎన్టీఆర్ ట్రస్టు రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

చల్లా బాబుకు పలువురి శుభాకాంక్షలు

రొంపిచెర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లెలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి మంగాపురంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని రొంపిచెర్ల మండలానికి ఆయన రాగానే టీడీపీ శ్రేణులు హారతులు పట్టి, మంగళవాయిద్యాలతో స్వాగతించారు.చల్లా ఇంటికి వచ్చిన పలువురు అధికారులు ఆయనకు పూలమాలలు వేసి, దుశ్శాలువాలు కప్పి సత్కరించారు.చల్లా బాబు తన తల్లి, మాజీ ఎంపీపీ ప్రేమలతమ్మ, భార్య , మాజీ సర్పంచ్ చల్లా సుప్రియారెడ్డి, కుమార్తె పూజారెడ్డి, టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు.మండల టీడీపీ అధ్యక్షుడు, కురబ కుల కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, మాజీ కన్వీనర్లు ఓబులేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, మాజీ ఎంపీటీసీ బి.అమరనాధరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ అమరనాధరెడ్డి, నాయకులు శ్రీనివాసులు నాయుడు, అబ్బారెడ్డి విజయ్, వి.మదనమోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సహదేవ, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, శేషాద్రి నాయుడు, జేసీబీ బాబురెడ్డి, కిరణ్‌కుమార్, సిద్ధయ్య, ఉయ్యాలశశి, వల్లిపోగు వెంకట్రమణ, పొన్నం వెంకట్రమణ, మేడసాని రవికుమార్ నాయుడు, నరిన్, గోవర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చల్లా రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలు

- పులిచెర్ల నుంచి భారీగా తరలిన నాయకులు, కార్యకర్తలు
- రక్తదానం చేసిన తెలుగు యువత


పులిచెర్లలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రంలోని బస్టాండు కూడలిలో గురువారం పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. చల్లా నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు రామనాథం నాయుడు, మురళీధర్, కుమార్‌రెడ్డి, ఆనంద నాయుడు, ధనంజయ నాయుడు, వెంకటరమణ, గోపి నాయుడు, రాణెమ్మ, నజీర్, లోకేష్, నాగరాజ నాయుడు, సుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి, మహేష్, రమేష్, సుబ్రమణ్యం, రామకృష్ణమనాయుడు, రాజగోపాలనాయుడు, నాగరాజు, శంకర్, నవీన్, చెంగల్రాయ నాయుడు, సురేష్, యోగేంద్ర, సుదాకర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● చల్లా రామచంద్రారెడ్డికి ఘన సన్మానం


రక్తదానం చేసిన తెలుగు యువతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

పుట్టినరోజును పురస్కరించుకొని చల్లా రామచంద్రారెడ్డికి పులిచెర్ల మండలానికి చెందిన టీడీపీ నాయకులు మురళీధర్ నాయుడు ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. నరేంద్ర చౌదరి, గిరి నాయుడు, వెంకట్రామా నాయుడు, కరుణాకర్ నాయుడు, అనీల్‌కుమార్, అబ్బాస్, మహేష్, రాజేష్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

● భారీగా తరలిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

చల్లా రామచంద్రారెడ్డి స్వగ్రామం రొంపిచెర్లలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలకు పులిచెర్ల మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మండలంలోని 25 పంచాయతీల నుంచి కార్లు, ద్విచక్ర వాహనాల్లో ర్యాలీగా వెళ్లారు. రహదారుల్లో ఎటుచూసినా రొంపిచెర్ల వైపు నాయకులు, కార్యకర్తలు తరలి వెళుతున్న దృశ్యాలు కనిపించాయి.

● రక్తదానం చేసిన తెలుగుయువత

చల్లా రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకల్లో ఏర్పాటుచేసిన రక్తదానం శిబిరంలో పులిచెర్ల మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి నిర్వహకులు సర్టిఫికెట్లు పంపిణీచేశారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం


బల్లలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మునస్వామి

రామకుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. గురువారం రామకుప్పం మండలం బల్లలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తహశీల్దారు బాబు, డీటీ బాలాజీ ఆర్‌ఐ నారాయణప్ప, సర్పంచు విజయ్‌కుమార్, నేతలు రామ్మూర్తి, నాగభూషణం, భాస్కర్, ఎర్రప్ప, మురళీమోహన్, బాలరాజు, అల్లీశీన తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వంలో ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారని టీడీపీ నేత, బోయకొండ మాజీ కమిటీ సభ్యులు జంపాల శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. అమినిగుంట పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. భూసమస్యలపై 26 అర్జీలు వచ్చినట్లు డీటీ మాధవి తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ గుణశేఖర్, ఆర్ భారతి, వీఆర్‌వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తహశీల్దార్ జయసింహ తెలిపారు. పులిచెర్ల మండలం మతుకువారిపల్లి సచివాలయ ప్రాంగణంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజల నుంచి వచ్చిన 18 అర్జీలకు రసీదులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ దొరస్వామి, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సోమల: సోమల రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై అధిక సంఖ్యలో వినతులు అందినట్లు తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. సచివాలయం వద్ద జరిగిన సదస్సులో పొలాల వద్దకు వెళ్లే దారి సమస్యలు పరిష్కరించాలని పలువురు రైతులు వినతులు అందజేశారు. రైతుల ఖాతా నెంబర్లలోని భూములు సక్రమంగా నమోదు చేయలేదని వాపోయారు. ఆన్‌లైన్‌లో పొరపాట్లు సరిచేయాలని కోరారు. కోర్టు విచారణలోని పలు భూసమస్యలపై ఫిర్యాదు చేశారు. ఎంపీటీసీ సావిత్రమ్మ, బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు, మండల సర్వేయర్ షాన్‌వాజ్, కార్యదర్శి మజహర్ బాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని డీటీ రమేష్‌బాబు తెలిపారు. పెద్దపంజాణి మండలం తుర్లపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు సుబ్రమణ్యంఆచారి, రాజన్న, శంకర, కవిత, గీత, దేవదాయ శాఖాధికారులు వీరకుమార్, జగదీష్, సర్వేయర్ సిరాజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు


చల్లా బాబును సన్మానిస్తున్న సుహేల్‌బాషా

పుంగనూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రరెడ్డి జన్మదినాన్ని పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో భారీ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ చల్లా రామచంద్రరెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, పుంగనూరును అభివృద్ధి బాటలో నడపాలని, చల్లా బాబు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం బస్సులు, కార్లలో రొంపిచెర్లకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో సీవీరెడ్డి, శ్రీకాంత్, మాధవరెడ్డి, వెంకటముని, పోలీసుగిరి, సుహేల్‌బాషా, శమీపతి, రామకృష్ణమరాజు,సుబ్రహ్మణ్యం, చలపతి నాయుడు, రెడ్డెప్ప నాయుడు, విశ్రాంత డీఎస్పీ సుకుమార్, మాజీ ఎమ్మెల్యే బగ్గిడిగోపాల్, గంగాధర్, వెంకటరెడ్డి, రమణ, గంగులప్ప, లక్ష్మణరాజు, సంజీవ, గంగరాజు, జనసేన నాయకులు విరూపాక్షి, చైతన్యరాయల్, హరినాయక్, శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


పుంగనూరులో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



నలగాంపల్లెలో మహిళలతో మాట్లాడుతూ... - స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న భువనేశ్వరి

అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పాలి: డీహెచ్‌పీఎస్



చిత్తూరు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 19: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి వ్యంగ్యంగా మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్ షా.. దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డీహెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేడ్కర్ పేరును ఉందుకు ఉచ్చరిస్తారు.. దేవుని పేరును స్మరిస్తే పుణ్యమైనా వస్తుందని వెటకారంగా మాట్లాడడం చూస్తే బీజేపీ నిజస్వరూపం అర్థమవుతుందన్నారు. వెంటనే అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నాగరాజు, దామోదరం, గోపీనాథ్, మణి తదితరులు పాల్గొన్నారు.

నగరి అంబేడ్కర్ విగ్రహం వద్ద..

నగరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరి అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసనలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఎంకే ప్రకాష్, గోవిందస్వామి బాలవర్దన్‌రాజ్, విజయ్‌చందర్, యోహాన్, రజని, కొల్లాపురి సందీప్, శివ తదితరులు పాల్గొన్నారు.



నగరిలో నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ యువజన సంఘం నేతలు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు ఎమ్మెల్యే మురళీమోహన్ సూచన



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

పూతలపట్టు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ సూచించారు. సహాయ పరికరాల నమోదుకు ప్రత్యేక గుర్తింపు శిబిరాన్ని గురువారం పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 462 మంది శిబిరానికి రాగా, 390 మంది అర్హులు కాగా, 72 మంది ఇప్పటికే పరికరాలు పొంది ఉన్నారన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 20న ఏపీఎస్ బాలుర హైస్కూల్ (నగరి), 21న వెంకటేశ్వర ఆలయం వెనుక ఉన్న బి.ఆర్. హైస్కూల్ (పుంగనూరు), 22న జడ్పీ హైస్కూల్ (పలమనేరు), 23న రాజావారిపార్కు (కుప్పం), 24న జడ్పీ హైస్కూల్ రామకుప్పం)లో శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ గురప్ప, అలింకో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ సిద్ధయ్య మృతి బాధాకరం: ఉపాధ్యాయ సంఘాలు



డీఈవో వరలక్ష్మికి వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమ్మెటివ్ పరీక్షల నిర్వహణలో భాగంగా ప్రశ్నపత్రాలు తెస్తూ పూతలపట్టు మండలం తలపులపల్లె జడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సిద్ధయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఉపాధ్యాయ సంఘాల నేతలు అన్నారు. గురువారం డీఈవో వరలక్ష్మిని కలిసి బోధనేతర పనుల కారణంగా టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పోలీసు స్టేషన్‌లో భద్రపరచిన ప్రశ్నపత్రాల బండిళ్లు రోజుకు రెండు సార్లు తేవడం ఇబ్బందికరంగా మారిందన్నారు. టీచర్లకు బోధనేతర పనులను తప్పించాలని కోరారు. సిద్ధయ్య కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేసి ఆదుకోవాలన్నారు. నేతలు గంటామోహన్, చెంగల్రాయమందడి, మదన్‌మోహన్, భాస్కర్ రావు, ముక్తార్, చంద్రన్, సారథి, తులసి తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలపై పునఃసమీక్షించాలి: యూటీఎఫ్

నగరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న అనాలోచిత నిర్ణయాలను పునఃసమీక్షించాలని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మణిగండన్, అధ్యక్షుడు మునిరత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశ్నపత్రాలను తీసుకెళుతూ టీచర్ సిద్ధయ్యశెట్టి రోడ్డుప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. మృతుని కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇంటి మెట్లకు, గుమ్మానికి తేడా తెలియదా రోజా?

● ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి గుమ్మానికి, మెట్లకు తేడా తెలియదా రోజా, కరుణాకర్‌రెడ్డి అంటూ ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే భానుప్రకాష్ విమర్శించారు. ఏదో మాట్లాడి టీవీల్లో, పత్రికల్లో ఎక్కాలన్న ధ్యాస తప్ప సంఘటనను పరిశీలించి వాస్తవాలు తెలుసుకుని మాట్లడటం చేతకాని వీరు రాజకీయ నాయకులేనా? అని దుయ్యబట్టారు. నగరి మండలం దామరపాకంలో బుధవారం నాడు వైసీపీ కార్యకర్త ఇంటి గుమ్మాన్ని ధ్వంసం చేశారని విమర్శించడం సరికాదన్నారు. రోడ్డును ఆక్రమించుకుని నిర్మించిన మెట్లకు, ఇంటి గుమ్మానికి తేడా తెలియక అవాకులు చెవాకులు పేలడం విచారకరమన్నారు. ఓటమి ద్వారా కలిగిన అంధకారం వల్లే ఏదంటే అది మాట్లాడుతున్నారు.. అవసరమైతే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా కంటివైద్యం చేయిస్తామని ఎక్స్‌లో పోస్టు చేశారు.

కొట్టుకుపోయిన రోడ్డుకు మరమ్మతులు



పెనుమూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని తూపల్లె నుంచి బండపల్లె వెళ్లే మార్గం నీవానది ఉధ్రుతికి కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో గురువారం మండలంలోని స్టోన్‌క్రషర్ యజమానులందరూ కలిసి ఈ రోడ్డును బాగు చేసుకున్నారు. మాజీ ఎంపీపీ వీరపల్లి హరిబాబునాయుడు ఈ పనులను పర్యవేక్షించారు.

వర్షాలకు దెబ్బతిన్న వంతెన

ఇబ్బంది పడుతున్న వాహనదారులు



కోనకాలువ వద్ద మధ్యలో దెబ్బతిన్న వంతెన

పాలసముద్రం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనకాలువ వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. చిత్తూరు-బలిజకండ్రిగ మార్గంలో పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఈ వంతెన ఉంది. రెండేళ్ల కిందట కురిసిన వర్షాలకు అప్పట్లోనే ఈ వంతెన పైభాగంలో గుంతలు ఏర్పడింది. స్థానికులు నల్లరాళ్లు, మట్టి వేసి గుంతలను పూడ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధ్రుతంగా ప్రవహించి వంతెనపై మధ్యభాగంలో పగుళ్లు ఏర్పడి గుంతలమయంగా మారింది. దీంతో ఈ మార్గంలో కొత్తగా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి: ట్రైనీ కలెక్టర్



సంతపేటలో జరిగిన సదస్సులో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. గురువారం 45, 46, 47 డివిజన్లకు సంబంధించిన రెవెన్యూ సదస్సును 46వ డివిజన్ సచివాలయంలో నిర్వహించారు. 45వ డివిజన్ ఇన్‌చార్జి విజయ, 46వ డివిజన్ ఇన్‌చార్జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: 170 గొల్లపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో 24 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు, ఆర్‌ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాలసముద్రం: గంగమాంబాపురంలో జరిగిన సదస్సులో తహసీల్దార్ అరుణకుమారి, ఆర్‌ఐ దేవి, సర్వేయర్ గణేష్, వీఆర్వో తంగరాజ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెనుమూరు: చార్వాగానిపల్లె, సీఎస్ అగ్రహారం గ్రామాలకు సంబంధించి గురువారం సచివాలయంలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. 45 అర్జీలు వచ్చాయన్నారు. సర్వేయర్ శశికిరణ్, వీఆర్వోశ్యామ్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఆళ్లమడుగులో తహసీల్దార్ రమేష్ సహా ఉద్యోగులు, సర్పంచ్ కామసాని నవనీతమ్మ, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షుడు దామోదరరెడ్డి, టీడీపీ నేత కామసాని దామోదరరెడ్డి పాల్గొన్నారు. కార్వేటినగరం మండలం పొనగల్లులో జరిగిన సదస్సులో 35 అర్జీలను తహసీల్దార్ నాగరాజు స్వీకరించారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



చెక్ అందజేస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధి కోసం హైదరాబాదుకు చెందిన విద్యాసాగర్‌రెడ్డి గురువారం రూ.లక్ష చెక్కును విరాళంగా అందించారు. దాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు దర్శన ఏర్పాట్లు చేశారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



చిత్తూరు అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): హెల్మెట్‌ధారణపై ట్రాఫిక్ పోలీసులు నగరంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. రెండ్రోజులుగా నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద, రోడ్లపై ప్లకార్డులు చేతబట్టి అవగాహన కల్పించారు. గురువారం సీఐ నిత్యబాబు, సిబ్బందితో కలిసి గాంధీ సర్కిల్, ఎంఎస్ఆర్ సర్కిల్, దర్గా సర్కిల్‌తోపాటు చర్చివీధిలో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు.

ప్రపంచ తెలుగు మహా సభలకు ఆహ్వానం



విమల

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించే ప్రపంచ తెలుగు మహా సభలకు నవ్యాంధ్ర రచయితల సంఘం(నరసం) జిల్లా అధ్యక్షురాలు కరణం విమలకు ఆహ్వానం అందింది. పర్యావరణ పరిరక్షణ అనే అంశం సెమినార్‌లో పరిశోధక వ్యాసం సమర్పించనున్నట్లు గురువారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రారంభమైన భజనలు



గంగాధరనెల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పండగనెల సందర్భంగా గంగాధరనెల్లూరులో రెండు వేర్వేరు చోట్ల భక్తిపాటలతో భజనలు ప్రారంభమయ్యాయి. గంగాధరనెల్లూరు(దిగవూరు, ఎగవూరు)లోని సీతారాముల ఆలయాల ఆధ్వర్యంలో రోజూ ఉదయం 5.30 నుంచి ఏడు గంటల వరకు గ్రామ వీధుల్లో తిరుగుతూ భజనలు చేస్తున్నారు. నెల చివరి రోజున సీతారాముల చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి ఊరేగిస్తారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

చౌడేపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పెద్దయల్లకుంట్ల గ్రామానికి చెందిన వెంకటప్ప కుమారుడు పూల రాజప్ప(53) కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసి, అతడి వద్ద ఉన్న 30 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి సూచించారు. గురువారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో 18 మండలాల వెలుగు సిబ్బందికి క్షేత్ర స్థాయిలో పథకాల అమలుపై సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల వారు బ్యాంకు నుంచి పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీడీలు, డీపీఎంలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలమివ్వండి



తహసీల్దార్ పార్థసారథికి అర్జీ అందజేస్తున్న నేతలు

యాదమరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు, కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ పార్థసారథికి దళితసంఘాల ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే మురళీమోహన్‌కు స్థానికులు విన్నవించారు. స్పందించిన ఆయన అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. జనసేన మండల అధ్యక్షుడు కుమార్, దళిత సంఘం నేతలు మురుగేషన్, జార్జ్, కుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా పెట్టండి



పిల్లలకు భోజనం వడ్డిస్తున్న జయప్రకాష్

పూతలపట్టు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు మధ్యాహ్న భోజనం రుచికరంగా పెట్టాలని సమగ్ర శిక్ష జిల్లా అధికారి జయప్రకాష్ సూచించారు. పూతలపట్టు ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. స్కూల్ కమిటీ ఛైర్మన్ నేతాజీ ఉన్నారు.

గుడిపాల: చీలాపల్లె, మొగరాలపల్లె పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో-2 గణపతి తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నగరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని ఓంశక్తి ఆలయంలో ఇరుముడి ఉత్సవాలను పురస్కరించుకుని 2025 సంవత్సరం క్యాలెండర్లను కమిషనర్ కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఆలయ నిర్వాహకులు జ్యోతినాయుడు,రెవెన్యూ ఆఫీసర్ వెంకట్రామయ్య, శానిటరీ అధికారి పురుషోత్తం, రామకృష్ణ, గుణశేఖర్, రాజు, వినోద్, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో భారం తగ్గుతుంది



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

నగరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ వాడకంతో భారం తగ్గుతుందని డీఈ సురేష్‌కుమార్ తెలిపారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నగరి ఓంశక్తి ఆలయం వద్ద నుంచి టవర్‌క్లాక్ వరకు విద్యుత్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏజేఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

తిరుప్పావై పారాయణం



భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకుడు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో నాలుగు రోజులుగా ధనుర్మాస తిరుప్పావై పారాయణం నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయ అర్చకుడు వేణుగోపాల్ బృందం తిరుప్పావై పాశురాలను పారాయణం చేశారు. అలాగే కట్టమంచి అత్తి వరదరాజ, సంతపేట విజయలక్ష్మి కాలనీ, రంగనాథ, గోదాదేవి సమేత వెంకటేశ్వర ఆలయాల్లోనూ తిరుప్పావై పారాయణం నిర్వహించారు. ఈవో సుబ్రమణ్యం నాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గణిత అభ్యసనం అవసరం

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గణిత అభ్యసనం ప్రతి విద్యార్థికీ ఎంతో అవసరమని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులకు, సూపర్వైజర్లకు, ద్వితీయ శ్రేణి టీచర్లకు భాషా గణితంలో పునాది అభ్యసనంపై మూడ్రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం మొదలైంది. గణిత బోధనపై మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ పీడీ హైమావతి, ఎంఈవో సెల్వరాజు, మోహన్, సీడీపీవో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పూజలు

వెదురుకుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట మేల్ మరువత్తూరు ఆదిపరాశక్తి సిద్ధుల పీఠం ప్రార్థనా పూజా మందిరంలో గురువారం రాత్రి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఓం శక్తి అలంకరణ, అమ్మవారి ఊంజల్ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు వీటీ హేమలత, ఎస్.గోవిందరాజులు, ఎం.గోవిందన్, మహేశ్వరి, ఎం.రంగన్, లత, సి.పయణి, జయంతి, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

శ్మశాన ఆక్రమణలు తొలగిస్తాం

విజయపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్మశాన ఆక్రమణలు తొలగిస్తామని తహసీల్దార్ కిరణ్ అన్నారు. గురువారం మహారాజపురంలో రెవెన్యూ సదస్సు జరిగింది. డిప్యూటీ తహసీల్దార్ అశోక్, సర్వేయర్ శేఖర్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, బాబు యాదవ్, రాజశేఖర్‌రాజు, లోకేష్‌రాజు, రాజేంద్రరాజు, వెంకటేసులు యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



ట్రోఫీలతో ఆయత్

యాదమరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఆయత్ షేక్ ఇటీవల ఢిల్లీలో జరిగిన యూసిమాస్ అబాకస్ ఇంటర్నేషనల్ కాంపిటిషన్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారు. ఈ విద్యార్థినికి, ఆమె తల్లిదండ్రులకు పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు అభినందనలు తెలిపారు.

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణ

విజయపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో రెండ్రోజులపాటు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ గురువారంతో ముగిసింది. పంచాయతీ అభివృద్ధి, ప్రణాళికపై ఈటీసీ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌నాగపద్మజ సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణప్రకాష్, ఈవోపీఆర్డీరాజేంద్ర పాల్గొన్నారు.

నింద్ర: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన రెండ్రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ముగిసిన శిక్షణ తరగతుల్లో ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాడైన మట్టిరోడ్డు పరిశీలన



గంగాధరనెల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు బంగారెడ్డిపల్లె పంచాయతీ శెట్టిపారం గ్రామం నుంచి మిట్టదళితవాడ వరకు పాడైన మట్టిరోడ్డు, దెబ్బతిన్న డ్యామ్‌ను గురువారం ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులను పిలిపించుకుని.. బురదమయంగా మారిన మట్టిరోడ్డును, దెబ్బతిన్న డ్యామ్‌ని బాగుచేయాలని ఆదేశించారు.

ఇంధనం పొదుపు చేద్దాం : ఎస్‌ఈ



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఈ, ఈఈ, డీఈలు

చిత్తూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంధనం పొదుపు చేద్దాం.. భావితరాలకు వెలుగునిద్దామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం వివేకానంద విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సుమారు 65 శాతం సబ్సిడీతో పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించిందన్నారు. డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి, ఏఈలు, లైన్‌మెన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన

ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి చిత్తూరు సర్కిల్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గిరింపేటలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ప్రైవేటీకరణ ఆపాలని నినాదాలు చేశారు.

రక్తదానం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్ క్రాస్ సొసైటీకి నగరంలోని ప్రభా గ్రాండ్ ఇన్ హోటల్ యజమాన్యం, సిబ్బంది గురువారం రక్తదానం చేశారు. 20 మంది రక్తదానం చేయగా.. వారిని సొసైటీ నిర్వాహకులు అభినందించారు. హోటల్ యజమాని మండి సుధ, డాక్టర్ విజయ్ కుమార్, సహదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.